సాక్షి
సంగారెడ్డి

శుక్రవారం 28-7-2023



జిల్లాకు రెడ్ అలెర్ట్! 8లో

సంగారెడ్డి జిల్లాకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న 24 గంటలు (శుక్రవారం) భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరికలు జారీ చేసింది.



విలీనమైనా.. జాడలేని అభివృద్ధి

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో విలీనమైన ఐదు గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి జాడ కనబడడంలేదు. సరైన మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం పది మందికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

బస్సు సర్వీసులు సక్రమంగా నడపాలి

డయల్ యువర్ ఆర్ఎంలో ప్రయాణికులు

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ ఉమ్మడి మెదక్ జిల్లా రీజియన్ పరిధిలో గురువారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని డిప్యూటీ రీజినల్ మేనేజర్ దైవాదీనం ప్రారంభించారు. మూడు జిల్లాల నుంచి పలువురు ప్రయాణికులు ఆర్ఎంతో మాట్లాడారు. వసతులు మెరుగుపరచాలని, బస్సు సర్వీసులు సక్రమంగా నడపాలన్నారు. ముద్దయిపేట నుంచి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జోగిపేట నుంచి పోచారం బస్సును క్రమం తప్పకుండా నడపాలన్నారు. సంగారెడ్డి నుంచి అశోక్ మాట్లాడుతూ టీ9 టిక్కెట్లు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. జంగంపల్లి నుంచి నరసింహారెడ్డి మాట్లాడుతూ దుబ్బాక జంగంపల్లి దౌలతాబాద్ చేగుంట మీదుగా జేబీఎస్‌కు బస్సులు నడపాలన్నారు. మెదక్ నుంచి కుమార్ మాట్లాడుతూ మెదక్ కమాన్ బస్టాండ్ వద్ద వర్షాకాలంలో బస్ షెల్టర్లను వేయాలన్నారు. ఎద్దు మైలారం నుంచి వీరయ్య మాట్లాడుతూ సంగారెడ్డి నుంచి శంకర్‌పల్లికి బస్సులు నడపాలని కోరారు. కుసంగి నుంచి సంగమేశ్వర్ మాట్లాడుతూ జోగిపేట వరకు బస్సులను వేయాలన్నారు. ప్రయాణికులు కోరిన విధంగా బస్సు సర్వీసులు నడిపేందుకు పరిశీలిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతు సంక్షేమానికి మోదీ కృషి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: రైతుల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కట్టుబడి ఉన్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. మనోహర్‌రెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని కేవీకేలో గురువారం 14వ విడత కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితం చేసే ప్రసంగాన్ని ప్రత్యక్షంగా రైతులతో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ఎరువుల కొరతలేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎరువులు తక్కువ ధరకు ఇస్తూ, పంట సాగు కోసం పెట్టుబడి సాయం, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. రైతలకు ముడి సరుకులు, విత్తనాలు, ఎరువుల పంపిణీ, భూసార పరీక్షల సేవలు ఒకేచోటు లభిస్తాయన్నారు. రిటైల్ ఎరువుల దుకాణాలు ఇకపై దశలవారీగా పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలు మారుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రశాంత్ పాటిల్, కేవీకే శాస్త్రవేత స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా

కొండాపూర్(సంగారెడ్డి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని 22 రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శించడం దుర్మార్గమన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేక అల్లాడుతున్నారు. వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చినా పరిష్కారం కాలేదన్నారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. అనంతరం డీఆర్ఓ నగేష్‌కు వినతి పత్రం అందజేశారు.

జిల్లాకు రెడ్ అలెర్ట్!



హత్నూర(సంగారెడ్డి): అలుగు పారుతున్న హత్నూర పెద్ద చెరువు

- నేడూ భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ
- ముందస్తు చర్యలు చేపట్టిన అధికార యంత్రాంగం
- పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- సంగారెడ్డిలోని భగత్‌సింగ్ కాలనీలో ఇళ్లలోకి వరద నీరు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లాకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న 24 గంటలు (శుక్రవారం) భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మరో రెండు రోజులు జిల్లాలో అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓభవన్, రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లను పునరావాస కేంద్రాలుగా సిద్ధం చేసింది. భారీ వర్షం కురిస్తే ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. కాగా గురువారం ఎడతెరపిలేని వర్షం జిల్లాను ముంచెత్తింది. ముసురుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి.

కంగ్టిలో 4.5 సెం.మీ

గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలో వివిధ చోట్ల నమోదైన వర్షపాతం ఇలా ఉంది. అత్యధికంగా కంగ్టి మండల కేంద్రంలో 4.5 సెం.మీల వర్షం పడింది. సిర్గాపూర్‌లో 3.5 సెం.మీలు, కల్హేర్‌లో 3.4 సెం.మీలు, నాగల్‌గిద్దలో 3.1 సెం.మీలు, నిజాంపేట, రాయ్‌కోడ్, మనూర్‌లలో 2.9 సెం.మీల చొప్పున వర్షపాతం రికార్డయింది. న్యాల్‌కల్, నారాయణఖేడ్‌లలో 2.7 సెం.మీల చొప్పున, వట్‌పల్లి, పుల్కల్‌లలో 2.6 సెం.మీలు చొప్పున వర్షపాతం నమోదైంది. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది.

సింగూరుకు పోటెత్తిన వరద

సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. గురువారం సాయంత్రం వరకు ఏకంగా 25,607 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు నీటి మట్టం 22.9 టీఎంసీలకు చేరింది. ఈ ప్రాజెక్టును కలెక్టర్ శరత్ సందర్శించారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో మంజీరా, నల్లవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. హత్నూరలో పెద్ద చెరువు, కుమ్మరికుంటల అలుగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

ప్రాణ, ఆస్తినష్టం

కంది మండలం చిద్రుప్ప పెద్దచెరువులో మునిగి కృష్ణ అనే యువకుడు మృత్యువాత పడ్డాడు. వట్‌పల్లి మండలం సాయిపేట్‌లో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. మనూరు మండలం శెల్గిరలో ఇల్లు కూలింది. ఝరాసంగం మండలం ప్యారవరం వాగు ప్రవాహం పెరగడంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. బోపన్‌పల్లి, ఏడాకులపల్లి, కప్పాడ్ గ్రామాల్లో మూడు ఇండ్లు కూలిపోయాయి. జిన్నారం మండలంలో జంగంపేట – జిన్నారం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

మత్తడి దుంకిన 159 చెరువులు

జిల్లాలో మొత్తం 1,374 చెరువులు ఉన్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 159 చెరువులు పూర్తిగా నిండి మత్తడి దుంకుతున్నాయి. 75 శాతం నుంచి వంద శాతం నిండిన చెరువులు 134 ఉండగా, 50 శాతం నుంచి 75 శాతం నిండిన చెరువులు 147 ఉన్నట్లు నీటిపారుదల శాఖ గుర్తించింది. 25 శాతం నుంచి 50 శాతం నిండిన చెరువులు 279 చెరువులు ఉండగా, మిగిలిన 19 చెరువుల్లో 25 శాతం మేరకు నీరు చేరింది.

నిలిచిన రాకపోకలు



వాగు ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు, అటువైపు ఉన్న సర్పంచ్, గ్రామస్తులు

ఝరాసంగం(జహీరాబాద్): భారీ వర్షానికి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండల పరిధిలోని ప్యారవరం శివారులో వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మొహర్రం వేడుకలు జరుపుకునేందుకు వచ్చిన ఇతర గ్రామాల ప్రజలు నానా అవస్థలుపడ్డారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ డీఎస్పీ రఘు, రూరల్ సీఐ వెంకటేశం, తహసిల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీఓ సుజాత, ఎస్ఐ రాజేందర్ రెడ్డి, సర్పంచ్ సంజీవమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్ వాగు వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వాగు ఉధృతి తగ్గేవరకు రాకపోకలు సాగించొద్దని అధికారులు హెచ్చరించారు. వాగుకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. మేదపల్లి, ఈదులపల్లి, దేవరంపల్లి గ్రామాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. బ్రిడ్జి నిర్మించాలని కోరినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణ నష్టం జరగొద్దు: కలెక్టర్

- సమన్వయంతో పనిచేయాలి
- పునరావాస కేంద్రాల ఏర్పాటు



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: వర్షాలతో ప్రాణనష్టం జరగకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. గురు, శుక్రవారం భారీ నుంచి అతి భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికతో గురువారం కలెక్టరేట్ నుంచి ఆయా శాఖల అధికారులు చేపట్టిన చర్యలపైతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు రెడ్ అలర్ట్ హెచ్చరిక ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలాల వారీగా ప్రజాప్రతినిధుల వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలను సందర్శించి నివేదికను ఇవ్వాలన్నారు. సురక్షితం కానీ చోట చర్యలు చేపట్టాలన్నారు. పునరావాస కేంద్రాలను ఇప్పటికే గుర్తించామన్నారు. సురక్షితంకాని భవనాలు, లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రమాదకర రోడ్లు, వంతెనల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మంజీరా, సింగూర్ డ్యామ్‌ల వద్ద గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారికి సూచించారు. మత్స్యకారులు చేపలు పట్టడానికి వెళ్లరాదన్నారు. కరెంటు స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిన వైర్లతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వైరల్ ఫీవర్స్ బాధితులకు మందులు ఇవ్వాలని, తగిన జాగ్రత్తలు సూచనలు ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. పంటలు మునిగిన చోట నీటిని ఏ విధంగా తీసివేయాలో, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్ఓ నగేశ్, నీటిపారుదల శాఖ ఎస్ఈ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెరువు నీరు రాకుండా చూడాలి

కంది(సంగారెడ్డి): చెరువు నీరు జాతీయ రహదారిపై రాకుండా చూడాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రమైన కందిలోని కిసాన్‌సాగర్ చెరువును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు నిండుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కట్టలు తెగిపోయి, చెరువులకు గండ్లు పడకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఇరిగేషన్ డీఈ బాలగణేష్, ఏఈ మజహర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యావిధానంతో మెరుగైన విద్య



విద్యార్థులు తయారు చేసిన కళాకృతులు

కంది(సంగారెడ్డి): జాతీయ విద్యావిధానం ద్వారా చక్కటి విద్య అందించవచ్చని కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపాల్ భారతి దేవి అన్నారు. గురువారం ఓడీఎఫ్‌లోని కేంద్రియ విద్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధించడం జాతీయ విద్యావిధానం ద్వారా సాధ్యమవుతుందన్నారు. అంతకుముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మూడేళ్లలో జరిగిన విద్యాభివృద్ధిని తెలియజేశారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన కళాకృతులను ప్రదర్శించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయా విద్యాసంస్థల ఉపాధ్యాయులతో పాటు హెచ్ఎం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సప్తర్షి మజుందార్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న విజ్ఞానం, నైపుణ్యాలతో విద్యార్థులను శక్తివంతం చేసేందుకు అంకిత భావంతో పనిచేయాలని భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ (ఐఐటీహెచ్) డీన్ ప్రొఫెసర్ సప్తర్షి మజుందార్ అన్నారు. భవిష్యత్ విద్యావేత్తలు –అవకాశాలు, సవాళ్ల అంశంపై ఈనెల 20, 21 తేదీల్లో హైదరాబాద్ ఐఐటీల్లో ఉన్నత స్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సుపై సప్తర్షి మాట్లాడుతూ విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలను పెంపొందించేందుకు ఐఐటీలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. సదస్సులో రీసెర్చ్ స్కాలర్ అఫైర్స్ (పీహెచ్‌డి), ఎంటెక్ ఎడ్యుకేషన్-కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్, టెక్-ఎడ్యుకేషన్ ఎకోసిస్టమ్, ఐఐటీలు, ఎన్ఐటీల్లో ఉత్తమ అభ్యాసాల ఏకీకరణ అంశాలపై లోతైన చర్చ జరిగినట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి తెలిపారు. ఇలాంటి సదస్సులు ఏటా నిర్వహించాలని నిర్ణయించారు.

పునరావాస కేంద్రాలలో వసతుల కల్పన

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో గుర్తించిన పునరావాస కేంద్రాలలో వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. గురువారం పునరావాస కేంద్రాలను సందర్శించి వసతులను పరిశీలించారు. టీఎన్జీఓ భవన్, రెవెన్యూ గెస్ట్ హౌస్‌ను పునరావాస కేంద్రాలకు సిద్ధం చేశామని తెలిపారు. వసతులపై ఆరా తీసి కమిషనర్‌కు పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పునరావాస కేంద్రాలకు తరలించే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలన్నారు.

ప్రగతిశీల రైతు అవార్డు



జహీరాబాద్: జహీరాబాద్ రైతుకు ప్రగతిశీల రైతు అవార్డుతో కేంద్ర పర్యాటక, సంస్కృతి శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సత్కరించారు. గురువారం హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో పీఎం కిసాన్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని రంజోల్ గ్రామానికి చెందిన బసంతపూర్ నర్సింహారెడ్డి కుమారుడు రమేష్‌రెడ్డి డ్రాగన్ ఫ్రూట్ సాగు, ఇతర ఉద్యానవన పంటల్లో నూతన ఆవిష్కరణలు చేసినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలి

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ డిమాండ్

కొండాపూర్(సంగారెడ్డి): విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాల నాయకులను అనుమితించొద్దని డీఈఓ ఇచ్చిన సర్క్యులర్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలమేరకు విద్యార్థి సంఘాలు, ప్రభుత్వ వ్యతిరేక మీడియా సంస్థల ప్రతినిధులను ప్రభుత్వ పాఠశాలల్లో అనుమతించరాదని, అనుమతిస్తే క్రమశిక్షణా చర్యలకు బాధ్యులవుతారని సర్క్యులర్ జారీ చేయడం సరికాదన్నారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్ర

నారాయణఖేడ్: బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబురావు వ్యాఖ్యానించడం దారుణమని, గిరిజనులు, బంజారాల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్ర పన్నుతున్నారని బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ అన్నారు. గురువారం నారాయణఖేడ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బంజారాలకు ఇచ్చిన రిజర్వేషన్లు అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్లు అన్నారు. సోయం బాబురావు కోయలు, గొండు, ఎస్టీ, లంబాడాల మధ్య చిచ్చుపెట్టడానికి యత్నిస్తున్నాడని ఆరోపించారు.

మటన్ మార్కెట్ కూల్చివేత



మటన్ మార్కెట్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

సదాశివపేట(సంగారెడ్డి): శిథిలమైన మటన్ మార్కెట్‌ను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గురువారం తెల్లవారుజామున మార్కెట్‌లో కొంత భాగం కూలిపోయింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.కృష్ణారెడ్డి సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున మొత్తం కూల్చివేయాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. ఉన్నతాధికారుల అనుమతితో వెంటనే కూల్చివేత చేపట్టారు. కూల్చివేత పనులను అదనపు కలెక్టర్(లోకల్‌బాడి) చంద్రశేఖర్ పరిశీలించారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలను గుర్తించాలని కమిషనర్‌కు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు.

ఎమ్మెల్యేకు పరామర్శ



పటాన్‌చెరు: కుమారుడిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని గురువారం సాయంత్రం బీజేపీ ఎమ్మెల్యేలు పరామర్శించారు. ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి ఎమ్మెల్యేకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సిరిపుర చెరువు పరిశీలన

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని సిరిపుర గ్రామ శివారులోని సిరిమక్క చెరువుతోపాటు చెరువు కుంటలనును జిల్లా నీటిపారుదల శాఖ అధికారి రవికుమార్ గురువారం సాయంత్రం పరిశీలించారు. చెరువుకట్ట కొద్దిగా కుంగిపోవడంతో స్థానికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

నల్లవాగుకు తగ్గని వరద

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగుకు వరద తాకిడి పెరిగింది. గురువారం ప్రాజెక్టు అలుగు పారింది. ప్రాజెక్టులో 2,767 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని ఏఈ సూర్యకాంత్ తెలిపారు. సిర్గాపూర్, కల్హేర్ మండలాల్లో వాగులు వరద నీటితో ప్రవహించాయి. కల్హేర్ సమీపంలో మహారాజు వాగు ఉధృతంగా ప్రవహించింది.

మహారాజు వాగులో వరద ప్రవాహం



సింగూరుకు జలసిరి

- 25607 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఈసీజన్‌లో డ్యామ్‌కు 5.5 టీఎంసీలు చేరిక
- ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్, సీఈ, ఎస్ఈ



సింగూరు ప్రాజెక్టు వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్, సీఈ, ఈఈ

పుల్కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతోంది. ఉపరితల ఆవర్తనం ఏర్పడంతో రెండు రోజులుగా డ్యామ్ పరీవాహకంలో భారీ వర్షాలు కురియడంతో ఇన్‌ఫ్లో పెరిగింది. డ్యామ్‌లోకి గురువారం 25,607 క్యూసెక్కుల నీరు చేరిందని ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు నీటి మట్టం 523.600 మీటర్లకు (29.917 టీఎంసీలు), కాగా ప్రస్తుతం 522.270 మీటర్లకు (22.936 టీఎంసీలు) ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో అంతా ప్రాజెక్టు పరీవాహకంలో కురిసిన వర్షం నీరు కావడం విశేషం. ఈ సీజన్‌లో జూలై 7 నుంచి ఇప్పటి వరకు 5.5 టీఎంసీల నీరు చేరిందని అధికారులు తెలిపారు. సింగూరు ప్రాజెక్టుకు వరద వస్తుండటంతో కలెక్టర్ శరత్, నీటిపారుదల శాఖ సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ మురళీధర్, ఈఈ మధుసూదన్ రెడ్డితో కలిసి డ్యామ్‌ను సందర్శించి నీటి ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. ప్రవాహ తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తు పరీవాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కలెక్టర్ వెంట ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, ఏఈఈలు మహిపాల్ రెడ్డి, స్టాలిన్ తహసీల్దార్ రాజయ్య ఎంపీఓ శ్రీకాంత్ ఉన్నారు.

'డబుల్' నిర్మాణం ఎన్నాళ్లు?

నిరుపేదలకు తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించి ఇస్తోంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కావడంలేదు. నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయో, ఎప్పుడు కేటాయిస్తారోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఇటీవల మంత్రి హరీశ్‌రావు డబుల్‌బెడ్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

– జహీరాబాద్ టౌన్

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నత్తనడకన పనులు
- ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- త్వరగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశం



ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ శరత్, ఎంపీ, ఎమ్మెల్యేలు (ఫైల్)



జహీరాబాద్‌లోని హోతి(కె) వద్ద నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు (ఫైల్)

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హోతి(కె) వద్ద 660 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ప్రారంభంలో పనులు ముమ్మరంగా జరిగాయి. ఏ కారణంచేతనో కాంట్రాక్టర్ నిర్మాణాలను మధ్యలోనే వదిలేసి వెళ్లడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ శరత్, ఎమ్మెల్యే మాణిక్‌రావు నిర్మాణాలపై సమీక్షించారు. నిలిచిన పనులను వెంటనే పూర్తి చేయాలని, కాంట్రాక్టర్‌ను మార్చాలని అధికారులను ఆదేశించారు. పనులను పర్యవేక్షిస్తున్న పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ అధికారులు కాంట్రాక్టర్‌ను మార్చారు. ఆ తరువాత పనులు ఊపందుకున్నాయి.

లబ్ధిదారుల ఎంపిక

డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తికాకముందే లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. లాటరీలో పేరు వచ్చిన వారు ఇళ్లు ఎప్పుడు కేటాయిస్తారా అని ఎదురు చూస్తున్నారు. నెలలు గడుస్తున్నా ఇళ్ల పనులు పూర్తికాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి కేటాయించాలని అధికారులను కోరుతున్నారు.

ఆగస్టు 15 వరకు పూర్తి చేయాలి

హోతి(కె)లో డబుల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, కలెక్టర్ శరత్‌తో కలిసి ఇటీవల పరిశీలించారు. నిర్మాణ పనులను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని, ఆగస్టు 15 తేదీ లోపు పూర్తిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి ఇచ్చిన గడువు దగ్గర పడుతున్నా ఇంకా పనులు నత్తనడకన నడుస్తున్నాయి.